సాక్షి ఒడిశా

సోమవారం। 14। అక్టోబర్। 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.6,49,470

- భువనేశ్వర్/పూరీ



రత్న వేదికపై స్వర్ణమూర్తుల దర్శనం

విజయ దశమి పురస్కరించుకుని పూరీ శ్రీమందిరం రత్న వేదికపై మూల విరాటులు స్వర్ణ అలంకరణతో భక్తులకు దర్శనం ఇచ్చారు.

-8లో▸



స్వగృహంలో సీఎం పూజలు

దసరా వేడుకలను ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.

-8లో▸

న్యూస్‌రీల్

పంట పొలంలో ఏనుగు మృతదేహం



పొలంలో పడివున్న ఏనుగు మృతదేహం

భువనేశ్వర్: పంట పొలంలో ఏనుగు మృతదేహం గుర్తించారు. అంగుల్ జిల్లా అఠొ మల్లిక్ అటవీ మండలం పరిధి మాధాపూర్ రేంజ్ శంఖమాల్ గ్రామం శివారులో పంట పొలంలో ఈ ఘటన వెలుగు చూసింది. ఈ మృత్యు సంఘటన పూర్వాపరాలు తెలియాల్సి ఉంది. సంబంధిత అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

ప్రసాదం తిని పలువురికి అస్వస్థత



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

భువనేశ్వర్: దసరా ఉత్సవాల్లో దేవీ పూజల ప్రసాదం తిని పలువురు అస్వస్థతకు గురయ్యారు. పూరీ జిల్లా గోప్ మండలం ఒటాంగ్ గ్రామంలో ఈ పరిస్థితి చోటుచేసుకుంది. ఈ గ్రామంలో దుర్గాదేవి పూజల్లో ప్రసాదం తిన్న వారంతా వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. దీంతో పులువురిని స్థానిక ఆస్పత్రిలో చేర్చి చికిత్స కొనసాగిస్తున్నారు. మరి కొందరి పరిస్థితి విషమించడంతో భువనేశ్వర్ ఆస్పత్రికి తరలించారు. భువనేశ్వర్ నుంచి ప్రత్యేక వైద్య బృందం ప్రభావిత ఒటాంగ్ గ్రామం సందర్శించింది. పరిస్థితిని క్షుణ్ణంగా సమీక్షిస్తోంది.

నైరుతి రుతు పవనాల నిష్క్రమణ



నైరుతి ప్రభావంతో వర్షం కురుస్తున్న దృశ్యం

భువనేశ్వర్: రాష్ట్రం నుంచి నైరుతి రుతు పవనాలు తరలిపోయే సమయం దగ్గర పడింది. దీనికి వాతావరణం అనుకూలిస్తోందని స్థానిక ప్రాంతీయ వాతావరణ కేంద్రం ఆదివారం తెలిపింది. రానున్న ఒకటి, రెండు రోజుల్లో నైరుతి రుతు పవనాలు వెనుదిరిగే అవకాశం ఉందని ఈ కేంద్రం పేర్కొంది. గుజరాత్, మధ్యప్రదేశ్, ఝూర్కండ్, బీహారు నుంచి రుతు పవనాలు తరలిపోతాయి. మహారాష్ట్ర, ఛత్తీస్‌గడ్, ఒడిశా, పశ్చిమ బెంగాలు, సిక్కిం ప్రాంతాల నుంచి నైరుతు రుతు పవనాలు పాక్షికంగా తరలిపోనున్నాయి. ఈ ఏడాది సాధారణ సమయం కంటే 4 రోజులు ముందుగా రాష్ట్రంలోకి రుతు పవనాలు ప్రవేశించిన విషయం తెలిసిందే. కేరళకు తాకిన 8 రోజుల్లో రాష్ట్రానికి నైరుతి రుతు పవనాల ఆగమనం ఆరంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా సగటున సాధారణ వర్షపాతం నమోదు అయింది. మరో వారం రోజులపాటు వర్ష సూచన లేనందున రుతు పవనాలు వెనుదిరిగేందుకు అనుకూలత ఏర్పడుతుంది.

దొంగ బాబా అరెస్టు



దొంగబాబా కైబల్య జాని

భువనేశ్వర్: రాష్ట్రంలో దొంగ బాబా ముసుగు తొలగింది. కటక్ జిల్లా టిగిరియా ప్రాంతంలో సోమ్‌పడా ఆశ్రమం బాబాగా చలామణి అవుతున్న కై బల్య జానీ అరెస్టు అయ్యాడు. యువతి అపహరణతో ఆశ్రమంలో వ్యవహారం గుట్టురట్టు అయింది. ఢెంకనాల్ జిల్లా భాపూర్ ప్రాంతంలో అపహరణకు గురైన యువతి తండ్రి దాఖలు చేసిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు చేపట్టిన దాడిలో దొంగ బాబా పట్టుబడ్డాడు. ఢెంకనాల్ సబ్ డివిజినల్ పోలీసు అధికారి ఎస్‌డీపీఓ ఆధ్వర్యంలో వ్యూహాత్మకంగా ఆశ్రమంపై దాడి చేసి నిందితుని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల దాడిలో ఆశ్రమంలో లైంగిక వ్యవహారాలతో పలు అభ్యంతరకర సంఘటనలు దృష్టికి వచ్చాయి. ఈ మేరకు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



భువనేశ్వర్: దుబాయ్ మిరాకిల్ గార్డెన్ అలంకరణతో దొమొణ పూజా ప్రాంగణం



భువనేశ్వర్: కటక్ చౌదరి బజార్‌లో పూజలందుకున్న బంగారు మాత



భువనేశ్వర్: జోద్‌పూర్ ఉమైద్ భవన్ రాజ భవనం నమూనాతో బరముండా పూజా పందిరి

● ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

జయ జయహే జననీ..!

రాష్ట్రంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ముగిశాయి. ప్రధానంగా కటక్, భువనేశ్వర్ జంట నగరాల్లో అత్యంత అట్టహాసంగా పూజలు నిర్వహించారు. అమ్మవారు తొమ్మిది రోజుల పాటు తొమ్మిది అవతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పలుచోట్ల స్వర్ణాలంకరణతో కనిపించి కనులవిందు చేశారు. దీంతో అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. తమ కుటుంబాలను కాపాడాలని కోరుతూ మొక్కులు చెల్లించుకున్నారు. చివరిగా దసరా రోజున ఆయుధ పూజలు చేపట్టారు.

– సాక్షి నెట్‌వర్క్



భువనేశ్వర్‌లో...



భువనేశ్వర్: కటక్ బాలూ బజారులో...



పర్లాకిమిడి: మోహనాలో పూజలందుకుంటున్న అమ్మవారు



భువనేశ్వర్: కటక్ మంగళా బాగ్‌లో...



రాయగడ: రాజరాజేశ్వరి రూపంలో లక్ష్మీ అమ్మవారు



రాయగడ: పసుపు వర్ణాల పూలతో మజ్జిగౌరి అలంకరణ



రాయగడ: కస్తూరీ నగర్‌లో పూర్ణాహుతి పూజలు



రాయగడ: గుణుపూర్ బౌరి వీధిలో...



రాయగడ: మునిగుడలో రావణ దహన బొమ్మ



కొరాపుట్: అమ్మవారి దర్శనం చేసుకున్న ఎమ్మెల్యే మనోహర్ రంధారి



కొరాపుట్: నబరంగ్‌పూర్ లో కాళీమాత దర్శనం



కొరాపుట్: ఉమ్మర్‌కోట్‌లో అమ్మవారి దర్శనం చేసుకుంటున్న మంత్రి నిత్యానంద గొండో దంపతులు



జయపురం: దసరా ఉత్సవాల్లో పాల్గొన్న రాజమాత సారిక దేవి



జయపురం: ఉత్సవాల్లో పాల్గొన్న దురువ యువతులు



జయపురం: వివిధ వేషాధారణల్లో కళాకారులు



జయపురం: దసరా వేడుకల్లో ఆదివాసీ మహిళలు



కొరాపుట్: నబరంగ్‌పూర్ మెయిన్ రోడ్డులో అఖండా ఆయుధ ప్రదర్శన

పూజా మండపంలో ఆభరణాల చోరీ

భువనేశ్వర్: దుర్గా పూజోత్సవాల్లో భారీ చోరీ సంఘటన చోటు చేసుకుంది. విజయ దశమి రోజున వేకువజామున ఈ ఘటన వెలుగు చూసింది. ముందురోజు అర్ధరాత్రి వరకు పూజోత్సవాల్లో హడావుడిగా ఉన్న నిర్వాహకులు చోరీ జరిగినట్లు గుర్తించారు. ఈ ఘటన బాలాసోర్ జిల్లా కొరై ప్రాంతంలో జరిగింది. బరుండై బెంగాలీ సాహి పూజా మండపంపై ఆసీనమై ఉత్సవ పూజలందుకున్న దేవీ అలంకరణలో విలువైన ఆభరణాలను ఆగంతకులు దోచుకున్నారు. ప్రధాన మండపంపై ప్రముఖ దేవీ ప్రతిమతో పార్శ్వ దేవతలకు అలంకరించిన ఆభరణాలను సైతం దొంగిలించారు. వీటి సమగ్ర విలువ రూ.15 లక్షలుగా అంచనా. ఈ ఘటనపై పూజా కమిటీ వర్గాలు స్థానిక కొరై ఠాణాలో ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. పూజా సమయంలో సాక్షాత్తు పూజా మండపంపై నుంచి నిలువెత్తు అమ్మవారిని అలంకరించిన ఆభరణాలను స్వల్ప వ్యవధిలో దొంగిలించి, ఆగంతకులు పోలీసు భద్రతకు సవాలు విసిరారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చోరీ జరిగిన పూజా మండపంపై అమ్మవారు

ప్రసవ 'వే'దన



గర్భిణీ శాంతమ్మను మోసుకెళ్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యాలు లేకపోవడంతో గర్భిణులకు ప్రసవ వేదన తప్పడం లేదు. జిల్లాలోని చిత్రకొండ సమితి బోడపోదర్ పంచాయతీ సమరంగిని గ్రామానికి చెందిన శాంతమ్మ ఖోర అనే గర్భిణికి నెలలు నిండడంతో శనివారం ఉదయం పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో వెంటనే ఆమె భర్త చిత్రకొండ ఆరోగ్య కేంద్రానికి ఫోన్‌చేసి అంబులెన్స్ పంపించాలని కోరారు. అయితే సమరంగిని గ్రామానికి సరైన రహదారి లేకపోవడంతో సుమారు రెండు కిలోమీటర్ల ముందునే అంబులెన్స్ ఆగిపోయింది. దీంతో చేసేదేమీలేక స్వయంగా కుటుంబ సభ్యులు ఆమెను స్ట్రెచ్చర్‌పై కూర్చొబెట్టి అంబులెన్స్ వరకు మోసుకెళ్లారు. అనంతరం చిత్రకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించగా, పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

• ఉత్సాహంగా 'సిందూర్'



మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో దండ కారణ్య పూజా కమిటీ ఆధ్వర్యంలో బెంగాలీ సాంప్రదాయ సిందూర్ ఆటను శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. దసరా రోజున బెంగాలీ మహిళలు తమ భర్త ఆరోగ్యంగా జీవించాలని మొక్కుకుంటూ అమ్మవారి ఎదుట ఆడుతారు. ఒకరికొకరు స్వీట్స్ తినిపించుకొని సిందూరం రాసుకుంటారు. అనంతరం అమ్మవారి మండపం వద్దనే ప్రసాదం తింటారు.

- మల్కన్‌గిరి





క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ దుర్మరణం


చంటి (ఫైల్)

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని కేశవరాయుని పాలేం గ్రామానికి చెందిన నాయని చంటి (26) అనే యువకుడు శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కేశవరాయునిపాలేం గ్రామానికి చెందిన ఈయన ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మురపాక గ్రామానికి బైక్ మీద వస్తుండగా హనుమయ్యపేట సమీపంలో వేరే బైక్ ఢీకొనడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. చంటికి వివాహమై ఏడాదిన్నర కావస్తోంది. ప్రస్తుతం అతని భార్య గర్భిణి. భర్త మృతి వార్త విని ఆమె గడ్డి మందు తాగేయడంతో రిమ్స్‌కు తరలించారు. లావేరు ఎస్ఐ లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏడుగురిపై కేసు నమోదు

సారవకోట: మండల కేంద్రంలో శనివారం జరిగిన దాడి ఘటనలో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపారు. సారవకోటకు చెందిన తెల్లి వెంకటేష్‌పై అదే గ్రామానికి చెందిన తెల్లి తిరుపతిరావు, రామచంద్రరావులతో పాటు మరో ఐదుగురు దాడి చేసి గాయపర్చినట్లు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. బాత్‌రూం తలుపు విషయంలో జరిగిన ఘర్షణలో వెంకటేష్‌పై దాడి జరిగినట్లు ఆయన తెలిపారు.

వ్యవసాయ మోటార్ చోరీ

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేట గ్రామానికి చెందిన సూర వేణుకు చెందిన వ్యవసాయ మోటార్ చోరీకి గురైంది. కింతలిమిల్లు సమీపంలోని రేవళ్ల వద్ద ఉన్న షెడ్ తలుపులు శనివారం పగలగొట్టి చోరీ చేశారు. వ్యవసాయానికి నీరు పెట్టేందుకు ఆదివారం ఉదయం వెళ్లగా మోటార్ తొలగించి ఉంది. కేశవరావుపేట, లక్ష్మీడిపేట, ఫరీదుపేట ప్రాంతాల్లో ప్రస్తుతం వ్యవసాయ మోటార్లు, మోటార్‌ల కాయిళ్లు దొంగతనం చేస్తున్నారు. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఘనంగా ఆదిత్యుని కల్యాణం


కల్యాణం జరిపిస్తున్న సాందీప్‌శర్మ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి కల్యాణోత్సవం ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఆశ్వయుజ శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా శ్రీ ఉషా పద్మిని చాయా సమేతుడైన సూర్యనారాయణస్వామి ఉత్సవ మూర్తులకు ఆగమశాస్త్రం ప్రకారం కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రోచ్ఛరణల మధ్య జరిపించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి సాందీప్‌శర్మ కార్యక్రమాన్ని జరిపించగా రూ.500 చెల్లించిన దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: డీఎస్సీ రాయనున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డీడీ విశ్వమోహన్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు మూడు నెలల పాటు శిక్షణ పొందేందుకు ఈ నెల 21 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. http:jnanabhumi.ap.gov.in లో ఎస్టీ, ఎస్సీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి సిక్స్ స్టెప్ వెరిఫికేషన్ పొందిన తర్వాత రాత పరీక్ష ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని సంబంధిత హాల్ టికెట్లు ఈ నెల 22 నుంచి 25వ తేదీలోగా ఆ వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ నెల 27వ తేదీన స్క్రీనింగ్ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయంలో ప్రత్యేక పూజలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శనివారం విజయ దశమి పూజలు నిర్వహించారు. వాహన, ఆయుధ పూజలు నిర్వహించారు. పూజల్లో భక్తిశ్రద్ధలతో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, అందరూ సుఖ శాంతులతో ఉండాలని, క్రమశిక్షణతో విధులు నిర్వహించి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకు రావాలని ఎస్పీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఎస్పీలు రాజశేఖర్, ఎల్.శేషాద్రి నాయుడు, సీఐ టి.ఇమ్మాన్యుయల్ రాజు, ఆర్ఐ నర్సింగరావు పాల్గొన్నారు.

అదరగొడుతున్న సిక్కోలు క్రికెటర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: అంతర్రాష్ట్ర అండర్-19 పురుషుల వన్డే క్రికెట్ వినూమన్కడ్ ట్రోఫీ (యూత్ లిస్ట్-ఏ మ్యాచ్‌లు) క్రికెట్ టోర్నీలో శ్రీకాకుళం జిల్లా స్టార్ క్రికెటర్లు నంబళ్ల సుశాంత్, రాజాన జున్నారావు సత్తా చాటుతున్నారు. ఆంధ్రప్రదేశ్ (ఏసీఏ) జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు. సెలెక్టర్ల దృష్టిని విశేషంగా ఆకట్టుకుంటున్నారు. బీసీసీఐ ఆధ్వర్యంలో మొహాలిలోని ఐఎస్ బింద్రా క్రికెట్ స్టేడియం పీసీఏ వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో భాగంగా ఈనెల 12వ తేదీన హిమాచల్‌ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఏసీఏ 25 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేపట్టిన ఆంధ్రా జట్టు 40.5 ఓవర్లలో 188 పరుగులు చేసింది. జట్టులో వన్‌డౌన్ బ్యాటర్‌గా బరిలోకి దిగిన నంబళ్ల సుశాంత్ 55 బంతుల్లో 4 బౌండరీలు, ఒక సిక్సర్ సాయంతో 31 పరుగులు చేసి రెండో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. వరుణ్‌సాత్విక్ 59 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఇక రాజాన జున్నారావు పది ఓవర్లు బౌలింగ్ చేసి కేవలం 41 పరుగులిచ్చి 5 కీలక వికెట్లు పడగొట్టడం విశేషం.

స్వగృహంలో సీఎం పూజలు


పూజలు నిర్వహిస్తున్న సీఎం దంపతులు

భువనేశ్వర్: దసరా వేడుకలను ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సొంత జిల్లా కెంజొహార్‌లో 3 రోజులపాటు పర్యటించారు. దీనిలో భాగంగా రాయికిలా ప్రాంతంలో సొంత ఇంటిలో దేవీ పూజను ప్రత్యేకంగా నిర్వహించారు. ఆయనతో సతీమణి డాక్టర్ ప్రియాంక మరాండి పాల్గొన్నారు. ప్రియతమ నాయకుడిని స్వగ్రామంలో కలిసేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రత్న వేదికపై స్వర్ణమూర్తుల దర్శనం


స్వర్ణ బలభద్ర స్వామి


సువర్ణ సుందరి సుభద్ర


బంగారు జగన్నాథుడు

భువనేశ్వర్: విజయ దశమి పురస్కరించుకుని పూరీ శ్రీమందిరం రత్న వేదికపై మూల విరాటులు స్వర్ణ అలంకరణతో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ దర్శనం కోసం భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చారు. విజయ దశమి సందర్భంగా శ్రీమందిరంలో ఆయుధ పూజ నిర్వహించడం ఆచారం. దీనిలో భాగంగా బలభద్రుని నాగలి, శ్రీజగన్నాథుని శంఖచక్రాదులకు పూజలు నిర్వహించారు. ఈ ఆయుధాలను శ్రీమందిరం నలువైపుల 3 సార్లు ప్రదక్షిణ చేయించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహిళ హత్య


దర్యాప్తు చేస్తున్న పోలీసులు

కొరాపుట్: మహిళని గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసిన ఘటన కొరాపుట్ జిల్లా పాడువా పోలీస్‌స్టేషన్ పరిధి కందుగుడలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సలపు కిలో భార్య మలే కిలో (64) ని గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. బల్దా సమీపంలోని భగీరథీ షరాఫ్‌కి చెందిన వ్యవసాయ భూమిలో ఈమె మృతదేహాన్ని గుర్తించారు. రాతితో తలపై మోది హత్య చేసినట్లు పోలీసులు ప్రకటించారు. సంఘటన స్థలంలో క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌లు ఆధారాల కోసం అన్వేషణ చేస్తున్నాయి.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు


గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలకు గురై చికిత్స పొందుతున్న తావడ్ సింగ్

టెక్కలి రూరల్: టెక్కలి మండలం పరిధిలో శనివారం జరిగిన పలు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు..

- స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గున్న అప్పన్న అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. కోటబొమ్మాళి నుంచి టెక్కలి వైపు ద్విచక్రవాహనంపై గున్న అప్పన్న అనే వ్యక్తి వస్తూ స్థానిక డిగ్రీ కళాశాల వద్ద మలుపు తిరుగుతూ అదుపు తప్పి పడిపోయాడు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న లారీ అప్పన్న కాలుపై నుంచి వెళ్లిపోవడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. ఆయనను టెక్కలి జిల్లా ఆస్పత్రికి అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.
- టెక్కలి నుంచి బన్నువాడ వెళ్లే మార్గంలో ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాల సమీపంలో శనివారం ఎదురెదురుగా వచ్చిన రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. నంబాలపేట గ్రామానికి చెందిన పి.రామకృష్ణ అతని భార్య దీపిక తన పాపతో కలిసి తన గ్రామం నుంచి టెక్కలి వైపు స్కూటీపై వస్తుండగా.. మోదుగవలస గ్రామానికి చెందిన ఓ యువకుడు తన ద్విచక్రవాహనంపై టెక్కలి నుంచి తన గ్రామం వైపు వెళ్తూ మోదుగవలస సమీపంలో ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నారు. ప్రమాదంలో స్కూటీపై ఉన్న పాప కొంత దూరం తుళ్లిపోగా భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరికి టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. ఈ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- మండలంలోని లింగాలవలస గ్రామం సమీపంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సతివాడ గ్రామం సమీపంలో గల క్వారీలో పనిచేస్తున్న రాజస్థాన్‌కు చెందిన క్రాంతి లాల్, తావడ్‌సింగ్ అనే ఇద్దరు వ్యక్తులు శనివారం లింగాలవలస గ్రామం సమీపంలో మద్యం తాగేందుకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో వారు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇరువురికి తీవ్రగాయాలు కావడంతో హుటాహుటిన 108లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్ అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఈ రోడ్డు ప్రమాదాలకు సంబంధించి టెక్కలి పోలీసులు వివరాలు సేకరించి కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో జారిపడి బాలుడు మృతి

కంచిలి: మండలంలోని కొత్తంపురం గ్రామంలో విజయదశమి రోజు శనివారం అదే గ్రామానికి చెందిన పన్నెండేళ్ల బాలుడు మద్ది త్రినాథ్ గ్రామంలోని కొత్త చెరువులో ప్రమాదవశాత్తూ జారి పడి మృతి చెందాడు. పోలీసులు చెప్పిన వివరాలు ప్రకారం.. త్రినాథ్ తండ్రి నీలయ్య తన ట్రాక్టర్‌ను శుభ్రం చేసేందుకు ఉదయం 7 గంటలకు కొడుకుతో కలిసి చెరువుకు వెళ్లారు. కుమారుడు త్రినాథ్ చెరువులో దిగి బకెట్‌తో నీళ్లు తీసుకొస్తుంటే తండ్రి గట్టు మీద ట్రాక్టర్‌ను శుభ్రం చేస్తున్నాడు. 7.30 గంటల సమయంలో ప్రమాదవశాత్తూ త్రినాథ్ చెరువులోకి జారిపడి నీళ్లలో మునిగిపోయాడు. దీంతో అక్కడ ఉన్న మిగతా పిల్లలు కేకలు వేయగా, ఆ కేకలు విని తండ్రి త్రినాథ్, అక్కడ ఉన్న మిగతా గ్రామస్తులు చెరువులోకి దిగి వెతకగా, అప్పటికే త్రినాథ్ అపస్మారకస్థితికి వెళ్లిపోయాడు. వెంటనే సోంపేట సీహెచ్‌సీకి చికిత్స నిమిత్తం తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. బాలుడు మఠం సరియాపల్లి మోడల్‌స్కూల్‌లో ఏడో తరగతి చదువుతుండగా, సోదరి గోపిక 9వ తరగతి చదువుతోంది. తల్లి జయలక్ష్మి గృహిణి. కుమారుడు ప్రమాదవశాత్తూ మృతిచెందడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుని తండ్రి నీలయ్య శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచిలి ఎస్ఐ జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో ఇద్దరు గంజాయి నిందితులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: పాతపట్నం అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద ఇటీవల ఒడిశాకు చెందిన బస్సు పాతపట్నంకు వస్తుండగా పోలీసులు తనిఖీ చేశారు. బస్సులో 17 కేజీల గంజాయితో తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నారు. అయితే పోలీసులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచుతున్నారు. సోమవారం వివరాలు వెల్లడించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

ప్రాణం తీసిన మద్యం బాటిల్


మృతుడు సవర సురేష్ (ఫైల్)

మెళియాపుట్టి: మద్యం బాటిల్ యువకుని ప్రాణం తీసిన సంఘటన శుక్రవారం రాత్రి మండలంలోని సవర మురికింటి భద్ర గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని మర్రిపాడు కె.పంచాయతీ పరిధిలోని సవర మురికింటి భద్ర గ్రామానికి చెందిన సవర సురేష్ (28) శుక్రవారం సాయంత్రం మద్యం సేవించడానికి భరణికోట గ్రామానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఒక విస్కీ బాటిల్‌ను ప్యాంట్‌లో పెట్టుకుని ద్విచక్రవాహనంపై వస్తుండగా.. బంజీరు గ్రామ సమీపంలో అదుపు తప్పి పడిపోయాడు. ప్యాంట్‌లో ఉన్న మద్యం సీసా పొట్టలో గుచ్చుకుపోవడంతో తీవ్ర రక్తస్రావమైంది. రాత్రి సమయంలో అటుగా వెళ్తున్న ఓ వ్యాపారి గుర్తించి యువకుడి ఫొటో తీసి గ్రామస్తులకు పంపించడంతో కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని 108 కి సమాచారం అందించారు. సిబ్బంది చూసి మృతి చెందినట్లు ధ్రువీకరించడంతో యువకుని తల్లిదండ్రులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. శనివారం కేసు నమోదు చేసి పాతపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. మృతుడికి వివాహం కాలేదు.

కరిగిపోతున్న కొండ

- టీడీపీ నాయకుల అండదండలతో యథేచ్ఛగా కంకర మట్టి తరలింపు
- చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు
- గతంలో ఇదే ప్రాంతంలో ఎర్రమట్టి తరలింపు సమయంలో మృతి చెందిన విద్యార్థి


తరగిపోతున్న ఎర్రకంకర మట్టి కొండ

పొందూరు: కంకర మట్టి కొండలు కరిగిపోతున్నాయి. లోలుగు గ్రామానికి చెందిన వ్యక్తి యథేచ్ఛగా కంకరమట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా తరలిస్తూ రూ.కోట్లు కూడపెడుతున్నారు. కూటమి అధికారం చేపట్టిన నాలుగు నెలల్లో దాదాపు రూ.4కోట్ల వ్యాపారం జరిగింది. రెవెన్యూ, గనుల శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో వీరి ఆగడాలకు అడ్డు లేకుండా పోయింది. మండలంలోని కృష్ణాపురం-రెడ్డిపేట రహదారిలో వీఆర్ గూడెం రెవెన్యూ పరిధిలో వందల ఎకరాల్లో ఎర్ర కంకర మట్టి కొండలు విస్తరించి ఉన్నాయి. ప్రస్తుతం ఈ కొండలు తరిగిపోతున్నాయి. చదునైన ప్రాంతాలుగా మారిపోతున్నాయి. ఓ టీడీపీ నాయకుడి కనుసన్నల్లో తరలింపు జరుగుతోంది. కొత్త ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు గడిచింది. దీంతో లోలుగు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రాత్రి, పగలు తేడా లేకుండా కొండను జేసీబీలతో తవ్వించి మట్టిని తరలిస్తున్నారు. కొండను దొలిచే క్రమంలో కొండపై మొక్కలను తొలగిస్తున్నారు. దీంతో పర్యావరణం దెబ్బతింటోంది. కొండను దొలిచేసి ఏకంగా రహదారిని ఏర్పాటు చేశారు. ట్రాక్టర్లు, లారీల రాకపోకలకు అనుకూలంగా మార్చుకున్నారు. పూర్తిగా కొండను చదును చేస్తున్నారేమో అన్నట్లు ఎర్రకంకర మట్టిని తవ్వేస్తున్నారు. గ్రావెల్ రోడ్లు వేసేందుకు, రియల్ ఎస్టేట్ స్థలాలకు, పంట భూములను ఎత్తుగా చేసి ఇళ్ల స్థలాలుగా మార్చేందుకు మట్టిని తరలిస్తున్నారు. పొందూరుకు చెందిన ఓ వ్యాపార వేత్త స్థలానికి వారం రోజుల్లో సుమారు రూ. 60 లక్షల మట్టిని తరలించారు. ఇటు శ్రీకాకుళం సైతం మట్టి తరలిపోతోంది. ఈ వ్యవహారమంతా రెవెన్యూ, పోలీసు, గనులశాఖ అధికారులకు తెలిసినా కనీసం అటువైపు చూసిన పాపాన పోవటం లేదు. ఇప్పటికే పదుల సంఖ్యలో ఎకరాల్లో కొండ తరిగిపోయింది.

గతంలో విద్యార్థి మృతి

గతంలో ఇదే ప్రాంతంలో ఎర్ర కంకరమట్టిని తరలిస్తున్నప్పు అక్కడ పనిచేస్తున్న ఓ విద్యార్థి మృతి చెందాడు. లారీ ఆ విద్యార్థిపై నుంచి వెళ్లపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై అప్పట్లో సీబీఐ విచారణకు మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కోరారు. ఇంత జరిగినప్పటికీ అక్కడ రెవెన్యూ, పోలీసు యంత్రాంగం లెక్క పెట్టలేదు దీనిపై తహసీల్దార్ ఆర్.వెంకటేష్(ఎఫ్ఏసీ)ను వివరణ కోరగా ఎర్ర మట్టి, కంకర మట్టి తవ్వేందుకు ఎలాంటి అనుమతులు లేవని చెప్పారు. వాటి తవ్వకాలకు సంబంధించి మైనింగ్ అనుమతులు ఉండాలని స్పష్టం చేశారు. ఆర్ఐ, వీఆర్‌ఓలను తవ్వకాలు ప్రాంతాలకు పంపించి విచారణ జరిపిస్తానని, తగు చర్యలు తీసుకుంటానని చెప్పారు.

● విందు భోజనం


రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి సొంత జిల్లా కెంజొహార్ పర్యటన పురస్కరించుకుని అక్కడి ప్రజలు ఆత్మీయంగా స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయనకు భారీ స్థాయిలో భోజన మర్యాద చేశారు. ముఖ్యమంత్రికి ప్రీతిపాత్రమైన 31 రకాల వంటకాలతో భారీ భోజనంతో విందు ఏర్పాటు చేసి ముచ్చటగొలిపించారు.

- భువనేశ్వర్

దాతల సాయంతో ఉచిత మహా ప్రసాదం


మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్

భువనేశ్వర్: విశ్వ విఖ్యాత శ్రీజగన్నాథుని దర్శనం కోసం పలు ప్రాంతాల నుంచి విచ్చేసే యాత్రికులకు ఉచితంగా మహా ప్రసాదం పంపిణీ చేయాలనే యోచనతో ప్రభుత్వం సన్నాహాలపై శ్రద్ధ వహిస్తోంది. అతి త్వరలో శ్రీజగన్నాథుని భక్తులకు ఉచిత ప్రసాదం వ్యవస్థ అందుబాటులోకి రానుందని న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ తెలిపారు. దర్శనం తర్వాత భక్తులకు స్వామి ప్రసాదం ఉచితంగా పంపిణీ చేసే వార్షిక వ్యయ అంచనా రూ.14 కోట్ల నుంచి 15 కోట్ల వరకు ఉంటుందన్నారు. అయితే ఈ వ్యవస్థని జయప్రదం చేసేందుకు ఔత్సాహిక భక్త జనం స్వచ్ఛంద విరాళంతో ముందుకు రావాలని మంత్రి అభ్యర్థించారు. అలాగే శ్రీమందిరం రత్న వేదికపై కొలువుదీరిన మూల విరాటులను కనులారా దర్శించుకునేందుకు అనుకూలమైన దర్శన వ్యవస్థ అమలు చేయనున్నారు. వరుసల వారీగా రద్దీని క్రమబద్ధీకరించి పురుషులు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు శ్రీ మందిరం ధ్వజ స్తంభం నుంచి మూల విరాటుల్ని దర్శించుకోగలుగుతారని మంత్రి వివరించారు. ఈ ఏడాది మార్గశిర మాసం నుంచి ఈ వ్యవస్థని ప్రవేశ పెట్టనున్నట్లు మంత్రి తెలిపారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి నృత్య పోటీలు


నిర్వాహకుల చేతుల మీదుగా బహుమతులు అందుకుంటున్న విజేతలు

కాశీబుగ్గ: దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మందస మండలం అంబుగాంలో ఆదివారం జిల్లాస్థాయి నృత్య పోటీలు భవన నిర్మాణ కార్మిక సంఘం, జైభవానీ మోటార్ యూనియర్ సంఘం ఆధ్వర్యంలో జరిగాయి. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా డాక్టర్ కుమార్‌నాయక్ కేకే సుమన్, మాస్టర్ రుషి, వ్యవహరించారు. గ్రూప్, డ్యూయెట్, సోలో మూడు విభాగాలుగా పోటీలు సాగాయి. విజేతలుగా గ్రూప్ విభాగంలో కాళీమాత సోంపేట ప్రథమ బహుమతి కైవసం చేసుకోగా, ఆర్టిక్స్ పలాస, హరిపురం వారు ద్వితీయ తృతీయ బహుమతులు అందుకున్నారు. డ్యూయెట్ విభాగంలో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు కోటబొమ్మాళి, సోంపేట, హరిపురానికి చెందిన డ్యాన్సర్లకు దక్కాయి. సోలో విభాగంలో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గీతిక, రాక్ స్టార్ చిరు, వేణురాయల్‌కు దక్కాయి.

రాష్ట్రస్థాయి క్విజ్ విజేత లండారిపుట్టుగ


క్విజ్ విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రజా ప్రతినిధులు

ఇచ్ఛాపురం రూరల్: బూర్జపాడులో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో లండారిపుట్టుగ జట్టు విజేతగా నిలిచింది. సరస్వతీదేవి పంచమ రాత్రి ఉత్సవాలు సందర్భంగా ఉద్యోగ సంఘం ఈ పోటీలను నిర్వహించింది. వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజయనగరం జిల్లా నెల్లిమర్ల, శ్రీకాకుళం జిల్లా పూండి జట్లు నిలిచాయి. విజేతలకు ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తి, నియోజకవర్గ జనసేన అధ్యక్షుడు దాసరి రాజులు బహుమతులు అందజేశారు. శమళ్ల రాజబాబు, బాలక శ్రీనివాస్, పూడి నీలాచలం, భూషణంలు క్విజ్ మాస్టార్లుగా వ్యవహరించారు.

సామాజిక ఆస్పత్రి తనిఖీ


కోటబొమ్మాళి సామాజిక ఆస్పత్రిలో హాజరు పట్టికను తనిఖీ చేస్తున్న ఆర్డీఓ కృష్ణమూర్తి

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి సామాజిక ఆస్పత్రిని శనివారం టెక్కలి ఆర్డీఓ ఎస్.కృష్ణమూర్తి ఆకస్మికంగా తనిఖీ చేశారు. దసరా రోజున వైద్యసిబ్బంది విధులకు హాజరుకాలేదని ఆస్పత్రికి వచ్చిన పేషెంట్ ఆర్డీఓకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఆస్పత్రికి వచ్చి తనిఖీ చేశారు.

ఇద్దరు డాక్టర్లు విధుల్లో ఉండాల్సి ఉండగా ఒక్క డాక్టర్ మాత్రమే వచ్చారు. ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, ఆరోగ్య మిత్ర విధుల్లో లేకపోవడంతో ఆర్డీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులకు హాజరు కాని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డీసీహెచ్‌ఓకు సిఫార్సు చేశారు. వారం రోజుల్లో మళ్లీ తనిఖీ చేస్తానని చెప్పారు.

వివాహిత ఆత్మహత్య


మృతురాలు పులి అరుణ కుమారి (ఫైల్)

కంచిలి: మండలంలోని పద్మతుల గ్రామానికి చెందిన వివాహిత పులి అరుణకుమారి(30) భర్త వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు చెప్పిన వివరాలు ప్రకారం.. ఈ నెల 11వ తేదీన రాత్రి 11 గంటల సమయంలో అరుణకుమారి, ఆమె భర్త లక్ష్మీనారాయణ గొడవపడ్డారు. ఈ గొడవ అనంతరం ఆమె పెరటికి వెళ్లి ఒంటిమీద డీజిల్ పోసుకొని నిప్పంటించుకున్నారు. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను సోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బరంపురం మెడికల్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. బరంపురం తరలిస్తుండగా దారిలో మృతి చెందారు. మృతురాలికి భర్తతోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతురాలి భర్త ఎన్.హెచ్. మెయింటెనెన్స్ పనుల్లో క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. దీనిపై సోంపేట సీఐ బి.మంగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్థానిక తహసీల్దార్ ఎన్. రమేష్‌కుమార్ పంచనామా రిపోర్టు నమోదు చేశారు.

కుమార్తె పెళ్లి కార్డులు పంచేందుకు వెళ్తూ..


మృతుడు మోహనరావు (ఫైల్)

టెక్కలి రూరల్: కుమార్తె పెళ్లి కార్డులు పంచేందుకు వెళ్తున్న తండ్రిని రోడ్డు ప్రమాదం బలి తీసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని శ్యామసుందరాపురం గ్రామానికి చెందిన రుంకు మోహన రావు(52) తన కుమార్తెకు ఈ నెల 20న వివాహం చేసేందుకు ముహూర్తం నిర్ణయించారు. పెళ్లి కార్డులు పంచేందుకు మోహనరావు ఆదివారం తన సైకిల్‌పై జాతీయరహదారి పక్కగా విక్రంపురం గ్రామానికి బయల్దేరారు. రోడ్డుకు అవతి వైపు ఉన్న విక్రంపురం (చింతపాడు) గ్రామానికి వెళ్లేందుకు డివైడర్ దాటుతుండగా శ్రీకాకుళం నుంచి పలాస వైపు వెలుతున్న లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో మోహనరావు తీవ్రగాయాలు కావడంతో హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యపరీక్షలు నిర్వహిస్తుండగా ఆయన చనిపోయాడని వైద్యులు తెలిపారు. విషయం తెలియడంతో మృతుడి కుటుంబంతో పాటు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఘటనపై టెక్కలి ఎస్ఐ-2 వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

క్రీడాభివృద్ధికి కలిసికట్టుగా పనిచేద్దాం

• కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



విజ్జి స్టేడియంలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహనాయుడు

విజయనగరం: చిన్న చిన్న దేశాలు సైతం క్రీడల ద్వారా ప్రపంచంలో ఎంతో గుర్తింపు పొందాయని అదే తరహాలో స్థానిక క్రీడాకారులు సైతం రాణించి ప్రత్యేక గుర్తింపు సాధించాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. విజయనగరం ఉత్సవాల్లో భాగంగా స్థానిక విజ్జీ స్టేడియంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్తరాంధ్ర స్థాయి ఆహ్వానపు క్రీడా పోటీలను కేంద్రమంత్రి ఆదివారం ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, స్కేటింగ్ క్రీడాంశాల్లో నిర్వహించిన పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ మన దేశ పేరు ప్రతిష్టలను అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింప చేసే శక్తి క్రీడాకారులకే ఉందన్నారు. క్రీడల ద్వారా మన ప్రాంతానికి మన దేశానికి ఖ్యాతిని తీసుకురావడంతో పాటు క్రీడాకారులకు వ్యక్తిగత గుర్తింపు కూడా లభిస్తుందన్నారు. 40 ఏళ్ల క్రితం ఎంతో ముందు చూపుతో విజ్జీ స్టేడియంలో ఏర్పాటు చేసిన మౌలిక వసతులను వినియోగించుకొని క్రీడల అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దామని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ విజ్జీ స్టేడియంలో అందుబాటులో ఉన్న వస్తువులను వినియోగించుకుని ఈ ప్రాంతానికి మంచి గుర్తింపు తీసుకురావాలని క్రీడాకారులను కోరారు. కార్యక్రమంలో పార్లమెంటు సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు, శాసన సభ్యురాలు అదితి గజపతి, కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని బ్యాంకు ఉద్యోగిని మృతి



వరలక్ష్మి (ఫైల్)

బొబ్బిలి: పట్టణంలోని పాత బొబ్బిలికి చెందిన రౌతు వరలక్ష్మి(59) పశ్చిమ గోదావరి జిల్లాలోని కాళ్ల ప్రాంతంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఆమె తన కుమారులతో కలిసి కారులో వ్యక్తిగత పనులపై వెళ్తుండగా కాళ్ల వద్ద గల మలుపులో ఎదురుగా లారీ రావడంతో వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమె కోమాలోకి వెళ్లగా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు ఆమె కుమారుడు బొబ్బిలి సాక్షి టీవీ రిపోర్టర్‌కు తెలిపారు. ఈ ప్రమాదంలో మరో ఇద్దరు కుటుంబ సభ్యులు స్వల్పంగా గాయపడినట్లు చెప్పారు. మృతురాలు వరలక్ష్మి పశ్చిమ గోదావరి జిల్లాలోనే ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో పనిచేస్తున్నారు.

రైలు ఢీకొని కానిస్టేబుల్ మృతి



జి.మల్లీశ్వరరావు (ఫైల్)

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పట్టణ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు ఢీకొని ఓ కానిస్టేబుల్ శనివారం మృతి చెందారు. ఈ ప్రమాదంపై గవర్నమెంట్ రైల్వే ఎస్సై వి.బాలాజీ రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కానిస్టేబుల్ జి. మల్లీశ్వరరావు (37) తన విధుల్లో భాగంగా ఓపెన్ డ్రింక్, గంజాయి బ్యాచ్‌లను పట్టుకునే క్రమంలో పార్వతీపురం టౌన్ రైల్వే స్టేషన్ సమీపంలో పహారా నిర్వహిస్తున్నారు. రాయగడ నుంచి విశాఖ వెళ్తున్న గూడ్స్ రైలును ఆయన గమనించక పోవడం వల్ల ఆది ఢీ కొట్టడంతో మృతిచెందారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

చోరీకి పాల్పడిన నిందితుడి అరెస్ట్

రామభద్రపురం: ఎస్‌బీఐ ఖాతాదారుల సేవాకేంద్రంలో దోపిడీకి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి ల్యాప్‌టాప్, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. మండల కేంద్రం రామభద్రపురంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఎస్సై వెలమల ప్రసాద్ ఆదివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామభద్రపురంలోని బైపాస్ జంక్షన్ సమీపంలో నడుపుతున్న ఎస్‌బీఐ ఖాతాదారుల సేవాకేంద్రంలో ఈ ఏడాది మే 18న దొంగతనం జరిగింది. సేవా కేంద్రంలోని ల్యాప్‌టాప్, రూ.లక్షా 62వేలు చోరీ జరిగినట్లు ఎస్‌బీఐ ఖాతాదారుల సేవాకేంద్రం నిర్వాహకుడు పీవీ సత్యారావు అప్పట్లో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు అప్పటి నుంచి వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఎట్టకేలకు ఈ నేరానికి పాల్పడిన మెంటాడ మండలంలోని పోరాం గ్రామానికి చెందిన జోగాడ భగవాన్ రామభద్రపురంలో శనివారం అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో స్థానిక శ్రీనివాస లాడ్జి వద్ద పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేయగా మే 18న ఎస్‌బీఐ ఖాతాదారుల సేవాకేంద్రంలో ల్యాప్‌టాప్, నగదు తానే దొంగతనం చేసినట్లు అంగీకరించాడు. అనంతరం భగవాన్‌ను అరెస్ట్ చేసి సాలూరు రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

అమ్మ జాతరకు అన్నీ సిద్ధం

• ఉదయం 11.30 గంటలకే పైడితల్లి చదురుగుడి వద్దకు సిరిమాను
• ముహూర్తం ప్రకారం 3 గంటల 5 నిమిషాలకు ఉత్సవం ప్రారంభం
• రెండురోజులకు 30 వేల లడ్డూ ప్రసాదం రెడీ
• రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి
• తొలేళ్లరోజు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న అశోక్ కుటుంబీకులు



డీవీవీ.ప్రసాదరావు, కార్యనిర్వహణాధికారి, పైడితల్లి అమ్మవారి దేవస్థానం, విజయనగరం

విజయనగరం టౌన్: గ్రామదేవతల ఆగమం ప్రకారం రాష్ట్రంలో జరిగే ఏకైక పెద్ద పండగ శ్రీ పైడితల్లి జాతర మహోత్సవం. నెలరోజుల పాటు నిర్వహించే సిరుల తల్లి జాతర మహోత్సవాలకు ఎటువంటి ఆటంకం కలగకుండా అన్ని ఏర్పాట్లను అధికారులు, ప్రజాప్రతినిధులందరి సహాయ, సహకారాలతో చేపట్టి జాతరను ఈ ఏడాది ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు స్పష్టం చేశారు. తొలేళ్ల రోజు ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు కుటుంబీకులు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. అదేవిధంగా టీటీడీ తరఫున పట్టువస్త్రాలను ఎమ్మెల్యే అదితిగజపతిరాజు సమర్పిస్తారు. తొలేళ్లు, సిరిమానోత్సవం రోజుల్లో లక్షలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించేందుకు తరలిరానున్న నేపథ్యంలో భారీ ఎత్తున క్యూలు, మ్యాట్‌లు, చలువ పందిళ్లు వేయించామని ఈఓ తెలిపారు. మంచినీరు, మజ్జిగ, చిన్నారులకు బిస్కెట్ ప్యాకెట్లు, పాలు పంపిణీ చేయనున్నామన్నారు. ఈ ఏడాది ఆకర్షణీయంగా బెస్తవారు తమ సంప్రదాయ వస్త్రధారణలో కనిపించనున్నారు. సిరిమాను తిరుగుతున్నంత సేపూ చదురుగుడిలో అమ్మవారికి లక్షపుష్పార్చన నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓతో సాక్షి ప్రత్యేక ఇంటర్వ్యూ..

ప్ర: పైడితల్లి దర్శనానికి వీఐపీలు వస్తే సాధారణ భక్తులకు దర్శనభాగ్యం కలిగేనా ?

జ: శ్రీ పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలకు ఈ ఏడాది ఎటువంటి టికెట్లు లేకుండా అందరికీ ఉచిత దర్శనం కల్పించాం. వీఐపీలు వచ్చినప్పుడు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశాం. కేవలం వీఐపీ మాత్రమే అంతరాలయంలోకి వెళ్లే విధంగా ఏర్పాటు చేశాం. అందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా ముందుకువచ్చి సహకరిస్తామని హామీఇచ్చారు. అదేవిధంగా అవకాశం బట్టి వేదాశీర్వచనాలు అందజేస్తాం. క్యూలో మధ్య లైన్ నుంచి వీఐపీలు నేరుగా అంతరాలయంలోకి చేరుకుని ఓ పక్కకు ఉంటారు. మధ్యలైన్‌కి చెరోవైపు ఉన్న క్యూల నుంచి భక్తులకు అమ్మ దర్శనం కలుగుతుంది.

ప్ర: ఉత్సవంలో ఎంతమంది భక్తులకు ప్రసాదం అందేలా కృషిచేస్తున్నారు?

జ: పైడితల్లి అమ్మవారి లడ్డూ ప్రసాదం, పులిహోర ప్రసాదాలను ఆలయం పక్కనే ఉన్న భవనంలో స్టాక్ రెడీగా ఉంచాం. రెండురోజులకు గాను 30వేల లడ్డూ స్టాక్ ఉంది. స్టాక్ తగ్గుతున్న కొద్దీ అవసరాన్ని బట్టి లడ్డూ చేసేందుకు సిబ్బంది కూడా రెడీగా ఉన్నారు. 80 గ్రాముల లడ్డూ రూ.15, 150 గ్రాముల పులిహోర రూ.10లకు అందజేస్తున్నాం. పులిహోర ప్రసాదం ఎప్పటికప్పుడు తయారుచేస్తూ, భక్తులకు అందుబాటులో ఉంచుతున్నాం.

ప్ర: ఉత్సవానికి ఎంతమంది సేవలందిస్తున్నారు?

జ: పైడితల్లి తొలేళ్లు, సిరిమానోత్సవాలకు ఉత్సవ ప్రత్యేకాధికారిగా సింహాచలం దేవస్థానం ఈఓ ఆర్‌జేసీ త్రినాథ్, పండగ ప్రత్యేకాధికారి, మాన్సాస్ ఈఓ కేఎన్‌వీడీ ప్రసాద్‌లతో పాటు రెడ్‌క్రాస్, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, పోలీసు సేవాదళ్, వివిధస్వచ్ఛంద సంస్థలు వారి అమూల్యమైన సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నారు. వారితో పాటూ రెండువేల మందికిపైగా పోలీసులు, దేవదాయశాఖ తరఫున విజయనగరం, పార్వతీపురం, శ్రీకాకుళంల నుంచి 90 మందికిపైగా సిబ్బందితో పాటు ఆలయం వెనుక ఏర్పాటుచేసిన డొనేషన్స్ కౌంటర్, ప్రసాదాల కౌంటర్‌ల వద్ద కెనరా బ్యాంక్ అధికారులు, సిబ్బంది సేవలందిస్తారు.

ప్ర: ఈ ఏడాది సిరిమాను ఉత్సవం వెలుతురు ఉన్నప్పుడే పూర్తిచేస్తారా?

జ: సిరిమానోత్సవం రోజున ఉదయం 11.30 గంటలకు హుకుంపేట నుంచి చదురుగుడికి సిరిమాను చేరుకుంటుంది. అక్కడి నుంచి సిరిమాను బిగించే ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఇరుసుమాను, పీటలు, బెస్తవారివల, తెల్ల ఏనుగు, అంజలిరథం, పాలధారకు సంబంధించి ఉత్సవానికి చదురుగుడి వద్ద సిద్ధమవుతాయి. ముహూర్తం ప్రకారం మధ్యాహ్నం 3 గంటల 5 నిమిషాలకు సిరిమాను ప్రారంభమవుతుంది. సాయంత్రం 5గంటలకల్లా వెలుతురు ఉన్నప్పుడే పూర్తవుతుంది. అయినప్పటికీ జిల్లా పోలీసుశాఖ, అగ్నిమాపకశాఖ, విద్యుత్ శాఖ, మున్సిపల్ తదితర శాఖల సమన్వయంతో అస్కాలైట్స్‌ను కూడా అందుబాటులో ఉంచుతున్నాం.

అన్నన్నా..అయ్యన్నా!

• అడుగడుగునా శాసనసభాపతికి పరాభవం
• ఆహ్వానపత్రికలో కనిపించని అయ్యన్న పాత్రుడి చిత్రం
• ముఖ్యఅతిథిగా హాజరైన సభకు కరువైన జనం
• అమ్మవారి ఉత్సవాల్లో ప్రోటోకాల్ ఉల్లంఘన



ముఖ్య అతిథి అయ్యన్న పాత్రుడి ఫొటోలేని ఆహ్వానపత్రం



ఉత్సవాల ప్రారంభసభలో ప్రసంగిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు



అయోధ్య మైదానం వద్ద డీపీఆర్‌వోను అడ్డగించిన పోలీసులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: శ్రీపైడితల్లి అమ్మవారి సంబరాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం విజయనగరం ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈసారి మాత్రం అధికారుల తీరు విచిత్రంగా ఉంది. కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజును, ఆయన కుమార్తె విజయనగరం ఎమ్మెల్యే అదితిని ప్రసన్నం చేసుకోవడానికి అధికారులు తెగ తాపత్రయం పడుతున్నారు. ఈ ప్రయత్నంలో ప్రోటోకాల్‌కు పూర్తిగా నీళ్లొదిలేస్తున్నారు. ఆహ్వానపత్రం మొదలుకుని కార్యక్రమాల నిర్వహణ వరకూ అశోక్ కుటుంబం అడుగులకు మడుగులొత్తుతున్నారు.

ఉత్సవాలకు సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్ కల్యాణ్, దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఆహ్వానించారు కాబట్టి ఆహ్వానపత్రంలో వారి చిత్రాలను ప్రచురించారు. ప్రోటోకాల్ ప్రకారం ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మడి సంధ్యారాణి చిత్రాలు వేశారు. వారి తర్వాత విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు చిత్రాన్ని ప్రథమ వరుసలో ముద్రించారు. వాస్తవానికి ప్రోటోకాల్ ప్రకారం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, విజయనగరం ప్రథమ పౌరురాలైన మేయర్ వెంపడాపు విజయలక్ష్మిలకు ప్రాధాన్యం ఇవ్వాలి. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు చిత్రం పరిస్థితీ అంతే! అంతకన్నా దారుణమైన అవమానం శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడికి ఎదురైంది. విజయనగరం ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథి. కానీ ఆహ్వానపత్రంలో ఆయన ఫొటో కాదు కదా కనీసం పేరు కూడా ప్రస్తావించలేదు. ఆయనకే మరో ఘోర అవమానం అయోధ్య మైదానంలో జరిగింది. అక్కడ ఏర్పాటుచేసిన విజయనగరం ఉత్సవాల ప్రారంభోత్సవ సభే అందుకు సాక్షి. వేదికపై ఉన్నంత మంది కూడా ఎదురుగా మైదానంలో కనిపించలేదు. అయ్యన్నపాత్రుడి ప్రసంగమంతా ఖాళీ కుర్చీలకే పరిమితమైంది. బహుశా ఆయన జీవితంలో ఇలాంటి సభ గతంలో ఎప్పుడూ చూసిఉండకపోవచ్చు.

పోలీసుల ఓవరాక్షన్..

విజయనగరం ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసిన అయోధ్య మైదానం వద్ద వీఐపీలకు ప్రత్యేక గేట్ పెట్టారు. పాస్ ఉన్నవారికే ప్రవేశమని పోలీసులు చెబుతూనే టీడీపీ నాయకులు చెప్పిన వారిని మాత్రం పాస్ లేకపోయినా అనుమతించారు. గతంలో అధికారులు, వారి కుటుంబసభ్యులు, మీడియా ప్రతినిధులను వీఐపీల గేట్ నుంచే అనుమతించేవారు. కానీ ఈసారి మాత్రం పోలీసులు వారిని పాస్ పేరు చెప్పి వెనక్కిపంపేశారు. చివరకు జిల్లా సమాచార శాఖ సహాయ సంచాలకుడు డి.రమేష్‌ను సైతం పోలీసులు అడ్డుకున్నారు. చివరకు తాను డీపీఆర్‌వోనని చెప్పినా పట్టించుకోలేదు.



స్పీకర్ ప్రసంగిస్తున్న సమయంలో వేదిక ముందు మైదానంలో పరిస్థితి ఇదీ

గొర్రెపాటి బుచ్చిఅప్పారావు కృషితో తాటిపూడి నిర్మాణం

• జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

జామి: తాటిపూడిరిజర్వాయర్ నిర్మాణానికి స్వాతంత్ర్య సమరయోధుడు స్వర్గీయ గొర్రెపాటి బుచ్చి అప్పారావు ఎంతో కృషిచేశారని జిల్లాపరిషత్‌చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన మండలకేంద్రం జామిలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొర్లె రవికుమార్ ఆధ్వర్యంలో గొర్రెపాటి బుచ్చి అప్పారావు 111 జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ముందుగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ బుచ్చి అప్పారావు వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషిచేశారని కొనియాడారు.

తాటిపూడికి జీబీ అప్పరావు పేరు పునరుద్ధరించాలి

ఉత్తరాంధ్రలో వంశధార, నాగావళి, గోస్తనీ, చంపావతి నదులు ఉండగా అనాటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి సాగునీటి సమస్యలు తీర్చడానికి కంకణం కట్టుకుని నారాయణపురం చానల్‌కు బొడ్డేపల్లి రాజగోపాల్ పేరు, తోటపల్లి రిజర్వాయర్‌కు గౌతు లచ్చన్న పేరు, మడ్డువలస రిజర్వాయర్‌కు గొర్లె శ్రీరాములునాయుడు పేరు పెట్టారని గుర్తు చేశారు. అదేవిధంగా తాటిపూడి నిర్మాణానికి జి.బి.అప్పారావు కృషిని అప్పటి ముఖ్యమంత్రి ప్రస్తుత ప్రతిపక్షనేత ఉన్న వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఈప్రాంతవాసులు తీసుకువెళ్లడంతో జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి వైఎస్సార్‌ను ఆదర్శంగా తీసుకుని తాటిపూడి రిజర్వాయర్‌కు జి.బి.అప్పారావుగారు పేరు పెట్టారన్నారు. రిజర్వాయర్ వద్ద ఆయన విగ్రహం కూడా పెట్టడానికి ఏర్పాట్లు జరిగాయన్నారు. ఇంతలో ఎన్నికలు రావడంతో విగ్రహం ఏర్పాటు జరగలేదని, కూటమి ప్రభుత్వం రాగానే రిజర్వాయర్‌కు జి.బి అప్పారావు పేరు తొలగించారని మండిపడ్డారు. ఆయన పేరును తొలగించి ఉత్తరాంధ్రలో వెనుకబడిన వర్గాల మనోభావాలు దెబ్బతీశారన్నారు. కూటమి ప్రభుత్వం పునరాలోచించి తిరిగి జి.బి.అప్పారావు పేరు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేయక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ అధ్యక్షుడు వేచలపు వెంకట చిన రామునాయుడు, జామి, గంట్యాడ జెడ్పీటీసీలు గొర్లె సరయు, వర్రి నరసింహమూర్తి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గొర్లె రవికుమార్,పార్టీ సీనియర్ నేతలు పాండ్రంకి సంజీవి, చలుమూరి సత్యారావు,స్వర్గీయ జి.బి.అప్పారావు మనుమడు దామోదర్, స్థానిక సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, ఉపసర్పంచ్ అల్లుపద్మ, నేతలు వాక అప్పారావు, నెక్కలి రమణ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పడి పాడి గేదె మృతి

భామిని: మండలంలోని నేరడి-బి వంశధార నదీ తీరంలో ఆదివారం పిడుగు పడి పాడె గేదె మృత్యువాత పడింది. వంశధార నది ఆవల గల ఒడిశాలోని ఖండవకు చెందిన రాధాకాంత్ దొరకు చెందిన పాడిగేదెపై పిడుగు పడింది. ఉరుములు,మెరుపులతో వర్షం కురుస్తుందనే ఆందోళనతో గేదెల మందను తోలుకుని వెళ్తున్న సందర్భంలో ఆకస్మాత్తుగా పిడుగు పడి సుమారు రూ.60 వేల విలువైన పాడెగేదె మృత్యువాత పడిందని కాపరులు ఆందోళన చెందుతున్నారు.

గుంటూరులో చెస్ పోటీలకు జిల్లా జట్టు సిద్ధం



చెస్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్ -15 బాల, బాలికల చెస్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఆదివారం పూర్తయ్యాయి. చెస్ అసోసియేషన్ విజయనగరం ఆధ్వర్యంలో స్థానిక ఫైర్ చెస్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో బాలుర విభాగంలో జి.లక్ష్మీ చరణ్ నాయుడు, కాండ్రేగుల ప్రహ్లాద్, ముప్పల నిహార్, ఎం.నిఖిలేశ్ వరుస నాలుగు స్థానాల్లో విజేతలుగా నిలిచారు. అలాగే బాలికల విభాగంలో బి. షణ్ముఖ ప్రియ, పరిణీత, నితీష, కె. సంజన వరుస స్థానాలను దక్కించుకున్నారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులను మెడల్స్‌తో సత్కరించారు. అక్టోబర్ 15, 16,17 తేదీలలో గుంటూరులో జరగబోయే ఏపీ స్టేట్ అండర్ -15 చెస్ టోర్నమెంట్‌కు పంపించేందుకు ఈ క్రీడాకారులను ఎంపిక చేసినట్లు చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం జిల్లా కార్యదర్శి కేవీ జ్వాలాముఖి తెలిపారు.

చింతపల్లి బీచ్‌లో యువకుడి గల్లంతు

పూసపాటిరేగ: మండలంలోని చింతపల్లిబీచ్‌లో దేవీ విగ్రహం నిమజ్జనం కార్యక్రమానికి వెళ్లిన యువకుడు సముద్రంలో గల్లంతయ్యాడు. గరివిడి మండలం దుమ్మెద గ్రామానికి చెందిన యిజ్జపురపు అచ్యుతరావు(25) గ్రామస్తులతో కలిసి ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో చింతపల్లి బీచ్‌లో దేవి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తుండగా కెరటాల ఉధృతికి సముద్రంలో గల్లంతయ్యాడు. గ్రామస్తుల కళ్లెదుటే అచ్యుతరావు సముద్రంలో కొట్టుకుపోవడంతో రక్షించడానికి ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో మెరైన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి గాలింపు చేపడుతున్నారు. ఈ మేరకు పూసపాటిరేగ ఎస్సై ఐ. దుర్గాప్రసాద్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదుపు తప్పి లారీ బోల్తా

బొండపల్లి: మండలంలో ఆదివారం ఉదయం అదుపు తప్పిన ఓ లారీ పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదానికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ఒడిశా నుంచి విశాఖపట్నం ఐరన్ ఓర్ లోడుతో వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు బొండపల్లి మండలంలోని నెలివాడ జంక్షన్ వద్ద జాతీయ రహదారి 26ను ఆనుకుని ఉన్న లోయలోని పొలాల్లోకి దూసుకు వెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అదృష్టవశాత్తు లారీ డ్రైవర్‌తో పాటు క్లీనర్ ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. బోల్తా పడిన లారీని క్రేన్ల సహాయంతో పోలీసులు బయటకు తీశారు. లారీని బయటకు తీసుకువచ్చినప్పుడు జాతీయ రహదారిపై అరగంట పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

చేపలు మృత్యువాత



చెరువులో చనిపోయిన చేపలు

జామి: మండలంలోని ఏఆర్.పేట పద్మనాభరాజు చెరువు మత్స్యకారుల సొసైటీ పరిధిలో ఉంది. ఆ చెరువులో ఏఆర్.పేట మత్స్యకార సొసైటీవారు చేపలు వేశారు.ఇటీవల వరుస మూడు రోజులుగా చెరువులోని చేపలు మృత్యువాత పడుతున్నాయి. చెరువులో ఉన్న చేపలకు వ్యాధులు సోకి మృత్యువాత పడుతున్నాయని మత్స్యకారుల సొసైటీ అధ్యక్షుడు ఎ.శ్రీను ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు రూ.3లక్షల వరకు నష్టం వాటిల్లిందని, ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని వాపోతూ ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

దుర్గమ్మకు ఎస్పీ దంపతుల పూజలు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్ దంపతులు

విజయనగరం క్రైమ్: చెడుపై సాధించిన విజయానికి ప్రతీకగా దుష్టశిక్షణ, శిష్ట రక్షణకు పోలీసులు వినియోగించే వివిధ ఆయుధాలు, వాహనాలకు ప్రత్యేకంగా పూజలు నిర్వహించడం సంప్రదాయమని ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో ఏర్పాటు చేసిన దేవీ శరన్నవరాత్రుల మంటపంలో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని దుర్గామాతకు ఎస్పీ వకుల్ జిందాల్, ఐదో బెటాలియన్ కమాండెంట్ మలిక గార్గ్ దంపతులు శనివారం ప్రత్యేక పూజలుచేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు ఎన్.గోపాలనాయుడు, ఆర్.రమేష్ కుమార్, టి.భగవాన్, ఎస్పీ సీఐలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సిరిమానోత్సవానికి పటిష్ట బందోబస్తు

• కమాండ్ కంట్రోల్, రూఫ్‌టాప్‌లు. క్రైమ్ బృందాల ఏర్పాటు
• అడుగడుగునా బాంబ్ స్క్వాడ్ తనిఖీలు
• ఎస్పీ వకుల్ జిందాల్



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: విజయనగర ఉత్సవాలు, శ్రీ పైడితల్లి అమ్మవారి తొలేళ్లు, సిరిమానోత్సవ సంబరాల్లో భాగంగా మూడురోజుల పాటు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. సిరిమానోత్సవాన్ని శాంతియుతంగా నిర్వహించేందుకు బందోబస్తును 25 సెక్టార్లుగా విభజించి, సుమారు రెండువేల మంది పోలీసులతో రెండు షిఫ్టులుగా విధులు నిర్వహించే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రధాన ఆలయం, వనంగుడి వద్ద బందోబస్తు నిర్వహించే సిబ్బందికి మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టామన్నారు. బందోబస్తులో ఇద్దరు అదనపు ఎస్పీలు, 11 మంది డీఎస్పీలు, 61 మంది సీఐలు/ఆర్ఐలు, 147 మంది ఎస్సైలు/ ఆర్ఎస్సైలతో పాటు, 17 మంది మహిళా ఎస్సైలు, 425 మంది ఏఎస్సైలు/హెచ్‌సీలు, 670 మంది కానిస్టేబుళ్లు, 136 మంది మహిళా కానిస్టేబుళ్లు, 369 మంది హోంగార్డులు, 200 మంది ఆర్మ్‌డ్ రిజర్వ్/ఎస్‌టీఎఫ్ పోలీసు సిబ్బందితో కలిపి రెండువేల మందిని బందోబస్తు నిమిత్తం వినియోగిస్తున్నా మని ఎస్పీ తెలిపారు. మొత్తం బందోబస్తును, కమాండ్ కంట్రోల్ నుంచి పర్యవేక్షించేందుకు అదనపు ఎస్పీని నియమించామని తెలియజేశారు. అమ్మవారి సిరిమానోత్సవ బందోబస్తు విధులను నిర్వహించేందుకు పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం, విశాఖ సిటీ, ఇతర జిల్లాల నుంచి పోలీసు అధికారులు, సిబ్బంది వస్తున్నారని తెలిపారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారి పండగను శాంతియుతంగా నిర్వహించేందుకు ప్రజలంతా పోలీసుశాఖకు సహకరించాలని, పోలీసుల సహాయాన్ని పొందాల్సిన వారు దేవాలయం ఎదురుగా ఏర్పాటుచేసిన తాత్కాలిక పోలీసు కంట్రోల్ రూమ్‌ల వద్ద సంప్రదించాలని సూచించారు. అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, అనకాపల్లి క్రైమ్ అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, సీఐలు ఏవీ లీలారావు, ఆర్‌వీఆర్‌కే. చౌదరి, టి.శ్రీనివాసరావు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

భక్తులతో సంయమనం పాటించండి: ఎస్పీ

విజయనగరం ఉత్సవాలు, శ్రీ పైడితల్లి అమ్మవారి తొలేళ్లు, సిరిమానోత్సవం పండగ నేపథ్యంలో బందోబస్తు నిమిత్తం వివిధ జిల్లాల నుంచి వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి నిర్వహించాల్సిన విధి నిర్వహణ, తీసుకోవాల్సిన భద్రత చర్యలపై పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం దిశానిర్దేశం చేశారు. పండగను తిలకించేందుకు వివిధ ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి ప్రజలు, భక్తులు జిల్లాకు వచ్చే అవకాశం ఉన్నందున ఎవరితోనూ తగాదా పడవద్దని సూచించారు. భక్తులు, ప్రజలతో మాట్లాడే సమయంలో సంయమనం పాటించాలని, ఏవైనా ఇబ్బందులు తలెత్తితే ఇన్చార్జ్‌లుగా వ్యవహరించే అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, అనకాపల్లి క్రైమ్ అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, డీఎస్పీలు ఎం.శ్రీనివాసరావు, ఎస్.రాఘవులు, పి.శ్రీనివాసరావు, ఎం.వీరకుమార్, పి.నాగేశ్వరరావు, సీతారాం, రాంబాబు పలువురు సీఐలు, ఎస్సైలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ మళ్లింపు ఇలా..

సిరిమానోత్సవం రోజున అక్టోబరు 15న ఉదయం 8 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ తొమ్మిది ప్రాంతాల్లో అన్ని రకాల వాహనాల రాకపోకలను నిషేధించామని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం తెలిపారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో ట్రాఫిక్ మళ్లింపు, పార్కింగ్ ప్రాంతాల వివరాలను ఆయన వెల్లడించారు.

అన్నివాహన రాకపోకల నిషేధిత ప్రాంతాలివే..

బాలాజీ జంక్షన్ నుంచి సింహాచలం మేడ జంక్షన్ వరకు, సింహాచలం మేడ నుంచి కోట వరకూ, బాలాజీ జంక్షన్ నుంచి గంటస్తంభం వరకూ, ఎంఆర్.కళాశాల నుంచి గురజాడ సర్కిల్ వరకూ, కన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి గంటస్తంభం వరకూ, ట్యాక్సీ స్టాండ్ నుంచి గంటస్తంభం, ఎం.జి.రోడ్డువరకూ, సామ్రాట్ లాడ్జి నుంచి శివాలయం మీదుగా ఎం.జిరోడ్డు వరకు, కమ్మవీధి నుంచి మూడులాంతర్లు జంక్షన్ వరకూ, గుమ్చి జంక్షన్ నుంచి కోట జంక్షన్ వరకూ వాహనరాకపోకలకు నిషేధించామన్నారు.

వాహనాలకు పార్కింగ్ ప్రాంతాలివే..

వివిధ ప్రాంతాల నుంచి విజయనగరం పట్టణంలోకి వచ్చే కార్లు, ద్విచక్ర వాహనాలను 18 ప్రాంతాల్లో పార్కింగ్ చేసేవిధంగా ఏర్పాట్లు చేశామన్నారు. రాజీవ్ స్టేడియం, రాజమన్నార్ టెంపుల్, డీఎస్‌డీఓ ఇండోర్ స్టేడియం, అయ్యకోనేరు గట్టు, ఫోర్ట్‌సిటీ స్కూల్ రోడ్డు, ఎస్‌వీఎన్.నగర్, కాశిరాజు ఎగ్జిబిషన్ గ్రౌండ్, అయోధ్య మైదానం, ఎం.ఆర్.కళాశాల హాస్టల్, పెద్దచెరువు, గురజాడ కళాక్షేత్రం, టీటీడీ కల్యాణ మంటపం, సీఎంఆర్ జంక్షన్ వద్ద గల పెద్ద చెరువు గట్టు, రైల్వేస్టేషన్, టింబర్ డిపో దగ్గర గల పెద్దచెరువు గట్టు, రామానాయుడు రోడ్డు, ఎంఆర్ కళాశాల వద్ద ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్, ఎంఆర్ కళాశాల వద్ద ఏర్పాటు చేశామని ఎస్పీ వివరించారు.